క్లుప్తంగా

వైభవంగా విజయ గణపతి బ్రహ్మోత్సవాలు



పాత గుంటూరు: ఎస్వీఎన్ కాలనీలోని శ్రీ పద్మావతీ గోదాసమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో విజయ గణపతి స్వామి అష్టాదశ(18) వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం ప్రాతఃస్నవనం, నిత్యహోమం, లక్ష్మీ సుదర్శన హోమం, పారమాత్మిక మహాశాంతి హోమం, బలిహరణ, అవభృత స్నానం, పూర్ణాహుతి, మహదాశీర్వచనం అనంతరం తీర్థప్రసాదాలను అందించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ద్వాదశ ప్రదక్షణలు, ఊంజల్ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం



పాత గుంటూరు: బ్రాడీపేట రెండోలైనులోని శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత ఓంకారక్షేత్రంలో శ్రీ సీతారామాంజనేయ నగర సంకీర్తనా సంఘం ఆధ్వర్యంలో కార్యదర్శి నంబూరి వేంకటనారాయణమూర్తి పర్యవేక్షణలో 89వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు, 93 వ సంఘ వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం శ్రీ ఆంజనేయ స్వామికి నాగవల్లీ దళార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు బుజ్జి బృందం నిర్వహణలో శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. దంపతుల ముత్యాల తలంబ్రాలు, మహా హారతి, మంత్ర పుష్పం, అర్చకుల ఆశీర్వాదం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. టీ. బాల సుబ్బారావు భక్తి సంగీతం, మంచికంటి వెంకట సత్యవతి శ్రీ మద్రామాయణ ప్రవచనంలో ఆంజనేయుడు సీతాన్వేషణ, సీతామాతతో సంభాషణ, లంకలో భీభత్సం చేసిన విధానాన్ని వివరించారు.

విద్యార్థులను పరామర్శించిన డైరెక్టర్ ప్రగతి

గుంటూరు మెడికల్ : అస్వస్థతకు గురై గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని గురుకుల పాఠశాల బాలికలను మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ కె.బి.ఎస్.ప్రగతి పరామర్శించారు. బాలికల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి, మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి వైద్యులకు సూచించారు.

బాలామృతంపై అవగాహన కల్పించాలి

నగరంపాలెం: గుంటూరు (యు) 13 ప్రాజెక్టులోని 169 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడు నెలల నుంచి మూడేళ్ల వయసు చిన్నారులకు ప్రతి నెల బాలామృతంను అందిస్తున్నట్లు అంగన్‌వాడీ టీచర్ డి.వేదవతి తెలిపారు. ఇందిరా ప్రియదర్శిని కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బాలామృతంపై అవగాహన సదస్సు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజు వంద గ్రాముల చొప్పున చిన్నారులకు తినిపించాలని అన్నారు. బాలామృతం సంచిపై ఉన్న పోషక విలువలను కూడా ప్రతి ఒక్క లబ్ధిదారులకు వివరించారు. అదే విధంగా ఎలా తినిపించాలనేది అవగాహన కల్పించారని పేర్కొన్నారు. లబ్ధిదారులు బాలామృతంను సద్వినియోగం చేసుకోవాలని, వృధా చేయవద్దని కోరారు. ఎప్పటికప్పుడు వాటిని పిల్లలకు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పరిమళ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న మహిళా మార్టుల ఏర్పాటుకు చర్యలు

నెహ్రూ నగర్: జగనన్న మహిళా మార్ట్‌లు రాష్ట్రంలో ఉన్న అన్ని మున్సిపాలిటీలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల సీఎంఎంలు, టీఈలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలోని ఆరు మున్సిపాలిటీలో జగనన్న మహిళా మార్ట్‌లు విజయవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. మిగిలిన మున్సిపాలిటీల్లో కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత తీసుకెళ్లి వారికి లబ్ధి చేకూర్చాలని ఆదేశించారు. అనంతరం యూనిసెఫ్ సంస్థ వారు నిర్వహించిన హ్యాండ్ వాష్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. హ్యాండ్ వాష్ కార్యక్రమం అన్ని మున్సిపాలిటీలో నిర్వహిస్తున్నామని, త్వరలో మార్కెట్ సెంటర్లలో కూడా హ్యాండ్ వాష్ కేంద్రలు ఏర్పాటు చేసి తగు రక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరు హ్యాండ్ వాష్ చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని సూచించారు.

ఆర్థికబలం చేకూర్చడమే జగనన్న లక్ష్యం

- మాజీమంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- 40వ డివిజన్ స్వర్ణాంధ్ర నగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



స్థానికులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబాన్ని అర్థికంగా బలోపేతం చేసి రాష్ట్రాన్ని, ప్రజలను అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని మాజీమంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. మంగళవారం 40వ డివిజన్ పెదపలకలూరులోని స్వర్ణాంధ్రనగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలను కలిసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేసిన పనులను వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తున్నామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తాము పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని చెప్పి సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి వారికి రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను పొందిన లబ్ధిని తెలియజేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి లక్షల రూపాయల విలువ చేసే ఇంటి స్థలం, ఇల్లు, అమ్మ ఒడి, జగనన్న తోడు, ఆసరా, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, ఆరోగ్యశ్రీ, వంటి పథకాలు అందించి జగనన్న ప్రతి కుటుంబం అభివృద్ధికి ఏవిధంగా మేలు చేశాడో వివరించారు.

అటువంటి జగనన్నకు మనమంతా అండగా ఉండాలని రానున్న ఎన్నికల్లో మరలా జగనన్నను గెలిపించుకుని సంక్షేమ పాలనలో సంతోషంగా మనమంతా జీవించాలని సూచించారు. ప్రతిపక్షాలు చేసిందేమి లేకపోయినా ప్రజలు సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉన్నారని చూసి ఓర్వలేక ప్రభుత్వంపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నాయని ప్రజలు గమనించి వారికి రానున్న ఎన్నికల్లో మరలా ఓటుద్వారా తగిన బుద్ధి చెప్పేందుకు జగనన్నకు అండగా ఉండేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలు తెలిపిన చిన్నచిన్న సమస్యలను స్థానిక అధికారులతో చర్చించి అప్పటికప్పుడే వాటిని పరిష్కరించారు.

కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి, గుంటూరు రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, కార్పొరేటర్లు తనబుద్ధు కృష్ణారెడ్డి, బి.స్మితపద్మజ, ఆర్‌అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు మెట్టు వెంకటప్పా రెడ్డి, పార్టీ ముఖ్యనేతలు ముత్యాల నాగరాజు, తంగెళ్ళ నాగేశ్వరరావు, ఖాశింపీరా, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు దుంపాల రాధ, చెరుకూరి సాంబశివరావు, ఉద్దగిరి మురళి, డబ్బూరి సూర్యప్రకాశ రావు, రాంజీ అంబేద్కర్, తోట నాగేశ్వరరావు, ఇంద్ర, ఏరువ జగన్‌మోహన్ రెడ్డి, మల్లిఖార్జున రెడ్డి, దాసరి నాగరాజు, మన్నెం లక్ష్మి, ఆరుదల సాంబశివరావు, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

వికలాంగునికి భరోసా

గుంటూరు రూరల్: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 40వ డివిజన్ స్వర్ణాంధ్రనగర్‌లో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే మేకతోటి సుచరిత స్థానికంగా ఉండే వేముల సునీల్ కుమారుడు ధనుష్ చిన్న వయస్సులోనే పోలియోతో బాధపడుతున్నాడని సమాచారం తెలుసుకుని వారి ఇంటికి వెళ్ళి బాబును పరామర్శించి బాబు తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆప్యాయంగా పలకరించి వారి కుటుంబానికి, బాబుకు ప్రభుత్వం ద్వారా అందించే సహాయ సహకారాలు అందిస్తానని భరోసాను అందజేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య
- కుల మతాలు, పార్టీలకతీతంగా పథకాల వర్తింపు
- పొన్నూరులో గడప గడపకు మన ప్రభుత్వంకు విశేష స్పందన



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు(చేబ్రోలు): ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని, మీ ఆశీస్సులే జగనన్న బలం అని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు పట్టణంలోని 28వ వార్డులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే కిలారి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. అధికారులు, నాయకులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. గడప గడపకు వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరిస్తూ యోగక్షేమాలు తెలుసుకుంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా జరిగిన వార్డు సమావేశంలో పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు వర్తింపచేస్తున్నారని తెలిపారు. కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చుతున్నట్లు వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వనివి కూడా అమలు చేస్తూ అందరి మన్ననలు పొందితున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల ముగింటికే పథకాలు తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రజల ఆశీస్సులు, దీవెనలు జగనన్నకు కొండంత బలమని, టీడీపీ కుట్ర, స్వార్థ రాజకీయాలను గమనించాలని సూచించారు.

మూడేళ్లలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అక్షరాస్యత ద్వారానే అభివృద్ధి సాధ్యమనే ఉద్దేశంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయిస్తున్నదన్నారు. నాడు– నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసినట్లు తెలిపారు. జగనన్న విద్యా దీవెన, విద్యా కానుక, అమ్మఒడి వంటి పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన కొన్ని సమస్యలను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అక్కడక్కడే పరిష్కరించారు. వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు నాగసూరి ప్రతాప్, భార్గవ్, బందవ్, వాసు, వెంకయ్య, శ్రీహరి, బాల, దాసరి నారాయణ రావు, ఆకుల వెంకటేశ్వరరావు, ప్రభాకర్, హనుమంతరావు, సైపుల్లా, మాము, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పొన్నూరులో విద్యుత్ సరఫరా నిలిపివేత

పొన్నూరు(చేబ్రోలు): పట్టణంలో బుధవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. మాసాంతర విద్యుత్ మరమ్మతులలో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పొన్నూరు, నిడుబ్రోలు మండలాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ శ్రీనివాసరావు తెలిపారు.

సరిపడా భోజనం పెట్టాల్సిందే!

ఆదేశించిన ఎంఈఓ



విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈఓ కెనడీ

కొమ్మూరు (కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ప్రతిరోజు సరిపడా మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ స్పష్టం చేశారు. మండలంలోని కొమ్మూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న పథకాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మధ్యాహ్న భోజన పథకంలో అనేక మార్పులు తీసుకు వచ్చినట్లు తెలిపారు. మారిన మెనూ ప్రకారం ప్రతిరోజు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ఆయన సూచించారు. పాఠశాలలో విద్యనభ్యశించే ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనం చేసే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు

- ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు
- ప్రకతి వ్యవసాయ అభివృద్ధికి కృషి చేస్తున్న రైతు నేస్తానికి అభినందనలు



జీవామృతం తయారీ విధానం గురించి కొమ్మినేనికు వివరిస్తున్న వెంకటేశ్వరరావు

గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి ఆరోగ్యాన్ని కాపాడుతూ ఆరోగ్యకరమైన పంటలను పండించి ఆరోగ్యంగా జీవించవచ్చని ప్రెస్ అకాడమి ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగ అభివృద్ధి, ప్రకృతి వ్యవసాయానికి ప్రత్యేక శిక్షణా తరగతులు, ప్రత్యేక కథనాలతో రైతులకు సేవలందిస్తున్న రైతునేస్తం వ్యవసాయ పత్రికా సంపాదకులు, రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ పద్మశ్రీ యండ్లమూరి వెంకటేశ్వరరావు సేవలను ఆయన కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ సెక్రటరీ మామిడిపల్లి బాల గంగాధర్ తిలక్ మాట్లాడుతూ రసాయనిక వ్యవసాయంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని దానికి పరిష్కారంగా రైతులు సేంద్రియ వ్యవసాయ బాట పడుతున్నారన్నారు. రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయానికి అవసరమైన మన దేశీయ గోజాతులు, ఒంగోలు, గిర్, పుంగనూరు, కాంగ్రెజ్ ఆవు జాతుల వ్యర్థాలతో తయారు చేసిన వివిధ రకాల కషాయాలు, ద్రావణాలు ఉపయోగించి పంటలు పండించడం ప్రత్యక్షంగా చూపించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో రైతులు, సేంద్రియ రైతులు రైతునేస్తం సిబ్బంది తదితరులున్నారు.

విద్యార్థిని బెదిరిస్తున్న యువకుడి అరెస్ట్

చేబ్రోలు: విద్యార్థిని ఫొటోను ఇన్‌స్టాగామ్ ద్వారా సేకరించి అసభ్యకరంగా మార్ఫింగ్ ఫొటోను డబ్బులు ఇవ్వమని బెదిరిస్తున్న యువకుడిని చేబ్రోలు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ జి.వెంకటాద్రి వివరాలను విలేకర్లకు వెల్లడించారు. విద్యార్థిని ఫొటోను సేకరించిన యువకుడు న్యూడ్ ఫొటోగా మార్ఫింగ్ చేసి ఇన్‌స్టాగామ్‌లో విద్యార్థిని స్నేహితులకు షేర్ చేశాడు. తన స్నేహితుల ద్వారా విషయం తెలుసుకున్న విద్యార్థిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ ఆదేశాల మేరకు సైబర్ క్రైం ఎస్ఐ వెంకటకృష్ణ, స్థానిక ఎస్ఐ వెంకటాద్రిలు కలిసి సాంకేతిక ఆధారాలతో నిందితుడిని పట్టుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా చాగల్లు మండలం నేలటూరు గ్రామానికి చెందిన వట్టికూటి మణిశ్రీరామ్ జుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. సైబర్ నేరాల బారిన పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ జి వెంకటాద్రి తెలిపారు.

జొన్నలగడ్డలో క్రాఫ్ బుకింగ్ వెరిఫికేషన్



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు మంగళవారం ఈ క్రాఫ్ బుకింగ్ డేటా సూపర్ చెక్ వెరిఫికేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల ఈ క్రాఫ్ బుకింగ్‌ను వెరిఫై చేశారు. వివిధ పంటలలో రైతులకు సమగ్ర యాజమాన్య పద్ధతులను గురించి రైతులకు వివరించారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి పంటనమోదు, ఈకెవైసీలను త్వరగా పూర్తి చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు.

రైతులు తమ పంటలను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకుంటే కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఐ.సుబ్రమణ్యం, వీఏఏ ఆనందబాబు, వంగా నవీన్‌రెడ్డి, నామా శ్రీనివాసరావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

చందూస్ సిల్వర్ కప్ క్రికెట్ చాంపియన్స్‌గా 'విజ్ఞాన్'



చందూస్ సిల్వర్ కప్‌ను అందుకుంటున్న విజ్ఞాన్ యూనివర్సిటీ జట్టు

చేబ్రోలు: గుంటూరులోని జేకేసీ కళాశాల ఆధ్వర్యంలో అధ్యాపకుల కోసం నిర్వహించిన 26వ చందూస్ సిల్వర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా విజ్ఞాన్ యూనివర్సిటీ నిలిచింది. స్థానిక జేకేసీ కళాశాలలోని క్రికెట్ గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ జట్టు భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు మీద 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మాజీ ఎమ్మెల్సీ, నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ రాయపాటి శ్రీనివాస్, జేకేసీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్ చేతుల మీదుగా విజ్ఞాన్ యూనివర్సిటీ టీమ్ కెప్టెన్ నల్లపనేని శ్రీకాంత్ ట్రోఫీను అందుకున్నారు. చందూస్ సిల్వర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలుగా నిలిచిన క్రికెట్ టీమ్ సభ్యులను ఛైర్మన్ లావు రత్తయ్య, వీసీ పీ.నాగభూషణ్ తదితరులు అభినందించారు.

ప్రాంగణ ఎంపికల్లో చలపతి విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్‌ను అందించి తమ కళాశాల లక్ష్యమని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో సూర్య టెక్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాల విద్యార్థులు 34 మంది ఉత్తమ ప్రతిభను చూపి ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వారికి ఏడాదికి రూ 3.5 లక్షల వార్షిక వేతనం అందిస్తూ సంస్థ ఒప్పందం చేసుకుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను చలపతి విద్యాసంస్థల ఛైర్మన్ వై.వి.ఆంజనేయులు, సెక్రటరీ సుజిత్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.కిరణ్ అభినందించారు.

అంకిరెడ్డిపాలెంలో ప్రతిష్టా మహోత్సవాలు



గ్రామోత్సవంలో కోలాటం ఆడుతున్న మహిళా భక్తులు

గుంటూరు రూరల్: నగర శివార్లలోని అంకిరెడ్డిపాలెం గ్రామంలో శ్రీ సీతా సమేత కోదండ రామాలయ ఆలయ, స్వామివార్ల స్థిర ప్రతిష్టా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం కార్యక్రమంలో భాగంగా స్వామివారికి, ఆలయ ధ్వజస్థంభానికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రజలు పెద్దల సమక్షంలో జరుగుతున్న ఆలయ స్థిర ప్రతిష్టా మహోత్సవాలలో భాగంగా ధ్వజస్తంభం, స్వామివార్ల విగ్రహాలను గ్రామ ప్రజల సందర్శనార్థం ప్రత్యేక ఊరేగింపు నిర్వహించారు. వీధుల్లోకి వచ్చిన స్వామికి ప్రజలు నీరాజనాలు పలికారు. వార్లు పోసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామోత్సవ కార్యక్రమంలో భక్తులు చేసిన కోలాటం ప్రజలను ఆకట్టుకుంది. 1వ తేదీన ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, స్వామివార్లకు అభిషేకాలు, జలాధివాసం జరుగుతుందన్నారు. 2వ తేదీన ప్రత్యేక పూజలు, పంచగవ్యాధివాసం, సాయంత్రం క్షీరాదివాసం, 3వ తేదీన తండులాదివాసం, సాయంత్రం ధాన్యాధివాసం, 4వ తేదీన పంచగవ్యాధివాసం, సాయంత్రం పుష్పాధివాసం, శయ్యాధివాసం 5వ తేదీన యంత్ర స్థాపన, మూర్తి స్థాపన, మహాపూర్ణాహుతి, మధ్యాహ్నం స్వామి తీర్థ ప్రసాదం మహాన్నదానం జరుగుతుందని ప్రజలంతా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు నిర్వాహకులు కోరారు.

వీవీఐటీలో పాప్ కార్న్ చిత్ర బృందం సందడి



నంబూరు వీవీఐటీలో విద్యార్థులతో కలసి సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్న పాప్ కార్న్ చిత్ర బృందం

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పాప్ కార్న్ చిత్రయూనిట్ సందడి చేసింది. పెదకాకాని మండలం నంబూరు వీవీఐటీ కళాశాలను మంగళవారం అవికా స్క్రీన్ క్రియేషన్స్ ఆచార్య క్రియేషన్స్ బ్యానర్‌పై మురళి గంధం దర్శకత్వంలో చిన్నారి పెళ్లికూతురు ఫేమ్ అవికా గోర్, సాయిరోనక్ హీరో హీరోయిన్‌లుగా రూపొందుతున్న చిత్రం పాప్ కార్న్ చిత్ర బృందం సందర్శించింది. ఫిబ్రవరి 10వ తేదీన విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర ప్రచార కార్యక్రమంలో భాగంగా హీరో సాయిరోనక్, హీరోయిన్ అవికా గోర్, దర్శకుడు మురళి గంధం విద్యార్థులతో కలసి సెల్ఫీలు దిగారు.

ఈ సందర్భంగా దర్శకుడు మురళి గంధం మాట్లాడుతూ ప్రముఖ హీరో అక్కినేని నాగార్జున విడుదల చేసిన ఈ చిత్ర ట్రైలర్ ఇప్పటికే మంచి స్పందన లభించిందన్నారు. హీరో సాయిరోనక్ మాట్లాడుతూ ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని, ఓ మంచి ప్రేమ కథ అని అన్నారు. చిత్ర బృందంతో కలసి విద్యార్థులు, నృత్యాలు, గీతాలు, సెల్ఫీలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, చిత్ర బృందం పాల్గొన్నారు.

నేడు విధుల్లో చేరనున్న జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్ గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఆశాసజని బుధవారం విధుల్లో చేరనున్నారు. కర్నూలులో పనిచేస్తున్న ఆమెను మ్యూచువల్ గ్రౌండ్స్‌లో గుంటూరుకు బదిలీ చేశారు. కర్నూలులో మంగళవారం రిలీవ్ అయి బుధవారం గుంటూరులో విధుల్లో చేరనున్నారు.

పెదకాకాని శివాలయంలో బహిరంగ వేలం

గణనీయంగా పెరిగిన స్వామివారి ఆదాయం



శివాలయంలో వేలంపాటలు నిర్వహిస్తున్న ఏసీ

పెదకాకాని: శివాలయంలో జరిగిన వేలంపాటల ద్వారా స్వామివారి ఆదాయం గణనీయంగా పెరిగినట్లు ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి దేవస్థానంలో మంగళవారం 2023–24 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించి 21 అంశాలకు సంబంధించి ఈ ప్రొక్యూర్‌మెంట్ కమ్ సీల్డ్ టెండర్, బహిరంగ వేలంపాటలు నిర్వహించారు. గత ఏడాది జరిగిన వేలంపాటల కన్నా ఈ ఏడాది నిర్వహించిన వేలంపాటల ద్వారా స్వామివారికి 38,41,691 రూపాయలు అదనంగా ఆదాయం పెరిగింది. ఈ వేలంపాటలకు దేవదాయశాఖ పర్యవేక్షణాధికారిగా ఏసీ కోట వీరాంజనేయులు వచ్చారు. కొబ్బరికాయల షాపు, గ్యాస్‌స్టవ్‌లు, టెంట్‌హౌస్, పార్కింగ్, ఫొటోలు, కొబ్బరి చెక్కల సేకరణ, వాహనాలకు బొట్లు, కూల్‌డ్రింక్ షాపు, విద్యుత్ దీపాలంకరణ తదితర అంశాలకు వేలంపాటలు జరగ్గా తలనీలాలు ప్రోగుచేసుకొను హక్కు, కళ్యాణమండపము పూల అలంకరణ, క్యాంటీన్, గోపంచకము విక్రయం వంటి పాటలు వాయిదా పడినట్లు ఏసీ తెలిపారు.

సైన్స్ ఎక్స్‌పోకు విశేష స్పందన



ప్రాజెక్టులను తిలకిస్తున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సైన్స్ సిటీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పోకు మంగళవారం విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. నగరంలోని వివిధ విద్యాసంస్థల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన విద్యార్థులు ప్రదర్శన తిలకించినట్లు కళాశాల ప్రిన్సిపల్ పీఎం ప్రసాద్ తెలిపారు. విద్యార్థులు చూసేందుకు వీలుగా తగిన సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. ప్రదర్శనలో వేదగణితం ద్వారా క్యూబ్లు, రూట్లు తదితరాలను సులభంగా కనుక్కోవడం, నేచురల్ సైన్స్ విభాగంలో భూమి పరిరక్షణ, ఫుడ్ టెక్నాలజీ, రసాయన శాస్త్రవిభాగాల నుంచి ఆకర్షణీయ వర్కింగ్ మోడల్స్, సాంఘిక శాస్త్ర విభాగం నుంచి అమరావతి స్తూపం విశేషాలు లాంటివన్నీ వర్కింగ్ మోడల్స్ రూపంలో 300 వరకు ఉన్నాయని చెప్పారు. వీటన్నిటినీ సందర్శకులు ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు. ప్రదర్శన బుధవారం సాయంత్రం 5.00 గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుందని, ప్రవేశం ఉచితమని ప్రిన్సిపల్ పీఎం‌ప్రసాద్ చెప్పారు.